
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
శనివారం 25 అక్టోబర్ 2025 పేజీలు 8




## అడవులు జాతి సంపద..

# ప్రతి అంగుళం అమూల్యం



- అడవుల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించం
- శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక
- దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం
- ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి
- అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి
- గ్రేట్ గ్రీన్ వాల్ రాష్ట్రానికి వరం కావాలి
- అటవీ శాఖ సిబ్బంది భద్రతకు అధిక ప్రాధాన్యం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్, మేజర్ న్యూస్ :** అడవులు జాతీయ ఆస్తి. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అడవుల రక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అడవులను రక్షించుకునే విషయంలో రాజకీయలకు తావుండదు. రాజీకి తావుండదు. అడవులు జాతి సంపద, ప్రతి అంగుళం అమూల్యం. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవుల రక్షణ విషయంలో మార్గదర్శకం చేస్తున్నారు. అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు కూడా అటవీ భూములను రక్షించే విషయంలో పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తే తన సొంత ఇలాకాలోని అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే, అప్పటి వ్యవస్థలో అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అలాంటి తప్పిదాలు కూటమి ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని,పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అటవీ భూమి అంగుళం కబ్జా అయినా వేగంగా స్పందించాల్సిన బాధ్యతను అటవీ అధికారులు తీసుకోవాలని చెప్పారు. కృష్ణాజిల్లా గన్నవరం మండల, కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల రెండు రోజుల వర్క్ షాప్‌లో ముఖ్య అతి థిగా పాల్గొన్నారు. అడవుల సంరక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ శాఖలో విభిన్నమైన బాధ్యతలు పంచుకోవడానికి సరిపడినంత సిబ్బంది లేరని ప్రతి సమీక్షలోనూ అధికారులు నా దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉన్న మార్గాలను కేబినెట్ ముందు ఉంచాం. సిబ్బంది నియామకం మిగతా 2లో

# పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం



- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ
- సామాజిక పశువుల చావిడి (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) ల సక్రమ నిర్వహణకు ఆదేశం
- పాడి రైతులను నిర్వహణలో భాగస్వామ్యుల్ని చేయాలని సూచన
- జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల్లో ని గోకులాల పరిశీలన

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** 2018-19 సంవత్సరంలో మెగా గోకులాల పేరిట నిర్మాణం చేపట్టిన సామాజిక పశువుల చావిడి (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) లను సక్రమంగా నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగ్గయ్యపేట మండలం బండిపాలెం, పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయి గూడెంలలోని సామాజిక పశువుల చావిడి (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) లను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.... జిల్లాలో ఏడు సామాజిక పశువుల చావిడుల నిర్మాణాన్ని గతంలో చేపట్టారని, అవి వివిధ స్థాయిల్లో ఉన్నాయని చెప్పారు. నాడు మెగా గోకులం పేరిట ఒక్కోదాని నిర్మాణానికి మిగతా 2లో...

### నేటి దినపత్రిక సూర్య కథనంపై

# స్పందించిన పంచాయితీ అధికారులు



- అధ్వాన్న రోడ్ల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాం
- నైనవరం పంచాయితీ కార్యదర్శి అజేంద్ర
- హుటాహుటిన కాల్వల్లో పూడికతీతతో పాటు రోడ్లపై ఫోకస్



సూర్య ఎఫెక్ట్

2లో

# అడవులు జాతి సంపద.. ప్రతి అంగుళం అమూల్యం







(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారంలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలి. ఎలాంటి సిఫార్సులకు తావివ్వవద్దు. అడవుల్ని సంరక్షించాలంటే అటవీ శాఖ అధికారుల భద్రత ప్రధానమైనది. అటవీ సిబ్బంది భద్రత పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి స్పష్టతతో ఉంది. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఇబ్బందిపెట్టినా, దాడులకు పాల్పడినా అది ఏ స్థాయి వ్యక్తులైనా వారిని ఉపేక్షించం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో ఇబ్బందులు ఉంటే వ్యక్తిగతంగా నన్ను కలిసి సమస్యను చెప్పండి. శ్రీశైలం ఘటన నా దృష్టికి వచ్చిన వెంటనే నిజానిజాలు తెలుసుకున్నాను. సిబ్బందికి తగిన న్యాయం జరిగేలా చూశాం. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి భయాలకు తావివ్వవద్దు.

రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం భూ భాగంలో నోటిఫై చేసిన అడవులు ఉన్నాయి. డి-నోటిఫై చేసిన దానితో కలిపితే మొత్తం 31 శాతంగా ఉండవచ్చు అని అంచనా. అయితే ఉన్న అడవుల్లో ఎంత పచ్చదనం ఉంది? ఆక్రమణల నేపథ్యంలో ఎంత శాతం అడవులు మిగిలాయి అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై సమగ్ర సర్వే చేసి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అటవీ భూములను స్వాధీనం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా, చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దు. 2047 నాటికి రాష్ట్ర భూ భాగంలో 50 శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలి. దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరం. భావితరాలకు పచ్చదనాన్ని పెంపొందించేలా చైతన్యవంతులను చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలం.

**గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్... గొప్ప ప్రయత్నం**

974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం మనది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంత రక్షణకు మడ అడవుల పెంపకం ప్రధానం. తీరం వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాటి చెట్లు, పాల్మిరా, పాడనస్ వంటి తీర ప్రాంత జాతుల మొక్కలు పునరుద్ధరణపై దృష్టి సారించి ఆకు పచ్చని గోడ నిర్మాణానికి కాల వ్యవధి పెట్టుకుని పని చేద్దాం. దీని వల్ల తీర ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి బతుకు భరోసా లభిస్తుంది. అలాగే తుపాన్లు, సునామీల వంటి విపత్తుల నుంచి సహజ సిద్ధమైన రక్షణ పొందవచ్చు. సముద్ర జీవ జాతులను కాపాడవచ్చు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సంవత్సరానికి 10 అడుగులకు పైగా సముద్ర గర్భంలో కలసిపోతుంది. ఇలాంటి కోతలను కూడా మడ అడవుల పెంపకం ద్వారా నివారించవచ్చు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆంధ్రప్రదేశ్ అనేది ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభిస్తున్నాం. దీన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. లక్ష్యాన్ని అధిగమించేలా పనిచేయాలి.

**ఎర్రచందనం విత్తనాలు చల్లేందుకు ప్రణాళిక**

శేషాచలం అడవుల్లో 1987 ప్రాంతంలో హెలీకాప్టర్ల ద్వారా విస్తారంగా ఎర్ర చందనం విత్తనాలు చల్లారు. అది రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి బీజాలు వేసింది. ఆ తర్వాత అలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పుడు మరోసారి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు విస్తారంగా చల్లే కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీంతోపాటు ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న ఎర్రచందనాన్ని తిరిగి రాష్ట్రానికి రప్పించే చర్యలు తీసకుంటున్నాం. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లిన సందర్భంగా ఆ రాష్ట్ర అటవీ అధికారులు మన రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుకున్న రూ.110 కోట్ల ఎర్ర చందనాన్ని పట్టుకుని వేలం వేసుకున్నట్టు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభావవంతంగా పని చేయాల్సిన అవసరం ఉంది.

బ్రిటీష్ హయాంలో అడవులు ఆదాయ మార్గాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. మన దేశ అవసరాల కోసం ఏటా రూ.22 వేల కోట్ల విలువైన 900 లక్షల క్యూబిక్ మీటర్ల కలపను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అడవులను కాపాడుకుంటూనే, డీనోటిఫై చేసిన ప్రాంతాలను కలప పెంపకానికి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్రదేశం ఉన్న ప్రతి చోటా కలప పెంచాలి. అవసరం అయితే పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా శాఖలను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలి. అడవి ఆదాయ వనరుగా ఉంటేనే సిబ్బంది కొరత సమస్యను అధిగమించగలం. దేశానికి అవసరం అయ్యే కలపను రాష్ట్రం నుంచి అందించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలి.

**హస్త కళలకు అవసరమయ్యే వృక్షాలు పెంచాలి**

ఉడ్ బ్యాంక్స్ ఏర్పాటు, ఎకో టూరిజం మీద దృష్టి సారించాలి. పర్యావరణాన్ని రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలి. తద్వారా గిరిజన యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలి. అడవులను కాపాడుకుంటూ, గిరిజనుల జీవనాధారానికి ఇబ్బంది కలగకుండా చూడాలి. అడవుల అందాలను ప్రజలు ఆస్వాదించే ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంపై దృష్టి సారించాలి. అది భవిష్యత్ పర్యాటక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ముడి కలప కొరత ఉంది. అంకుడు, తెల్ల పొనికి చెట్లను విస్తృతంగా పెంచి ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ఇబ్బందులు లేకుండా చూడాలి. కళాకారుల అవసరానికి తగినంతగా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొండపల్లి బొమ్మల తయారీకి వినియోగించే తెల్లపొనికి చెట్ల పెంపకం సవాలుతో కూడుకున్న వ్యవహారం. అవి చాలా నెమ్మదిగా పెరుగుతాయి. వీటి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలి. ఒక పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని ముందుకు తీసుకు వెళ్లాలి. మానవులు - జంతువుల సంఘర్షణను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలి. రాష్ట్ర సరిహద్దు జిల్లాలు అయిన చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మదపుటేనుగుల సంచారం ఎక్కువగా ఉంది. చిత్తూరు జిల్లాలో సమస్య పరిష్కారానికి కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకువచ్చాం. శ్రీకాకుళంలో తొమ్మిది ఆడ ఏనుగులు సంచరిస్తున్నట్టు సమాచారం ఉంది. ఇవి ఒడిశా నుంచి వచ్చాయి. ఒడిశాలో మైనింగ్ పెరిగిపోవడంతో అవి ఇటు వైపు వలస వచ్చినట్టు తెలుస్తోంది. మన రాష్ట్రంలో అవి తిరుగుతున్న ప్రాంతం మొత్తం పంట పొలాలున్న ప్రాంతం. ఈ సమస్య పరిష్కారానికి అవసరం అయితే ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి వాటిని తిరిగి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. అడవుల సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, గిరిజనుల కోసం ఏదైనా చేయాలన్న తపన, నిబద్ధతతో పని చేయాలని ముందుకు వచ్చే అధికారులకు కూటమి ప్రభుత్వం తరఫున మావంతు సహకారం అందిస్తాం. అడవులను కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పెంపొందించుకుంటూ పచ్చని హరితాంధ్రప్రదేశ్ నిర్మిద్దాం” అన్నారు.

**గ్రేట్ గ్రీన్ వాల్ పోస్టర్ల విడుదల**

ఈ సందర్భంగా గ్రేట్ గ్రీన్ వాల్ ప్రచార పోస్టర్లు అధికారులతో కలిసి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అంతకు ముందు ఎన్ఐఆర్డీలోని నక్షత్ర వనాన్ని పరిశీలించి ప్రతి మొక్క వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. జమ్మి చెట్టును నాటారు.

ఈ కార్యక్రమంలో తొలిగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. సుస్థిరమైన అభివృద్ధిని సాధించుకుంటూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలనేది స్వర్ణాంధ్ర విజన్ 2047 ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అటవీ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన ప్రణాళికలను అవగాహన కల్పించుటలో ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రికి రాష్ట్ర పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతికత ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (అటవీ) పి మల్లిఖార్జునరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్ఐడిఎం దక్షిణ క్యాంపస్ జాయింట్ డైరెక్టర్ కల్నల్ పియస్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ అధిపతి డాక్టర్ పీవీ చలపతిరావు, అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతిప్రియ పాండే, రాహుల్ పాండే, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు తదితర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల అటవీ శాఖ అధికారులు, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఇరవై ఒక్క లక్షల రూపాయలతో ప్రతిపాదనలు పంపారని చెప్పారు. ఒక్కో షెల్టర్లో 20 పశువులకు ఆశ్రయం కల్పించాలన్నది లక్ష్యమని తెలిపారు. వసతిలేని పాడి రైతులకు ప్రయోజనం కలిగించాలన్న ఉద్దేశ్యంతో వీటి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. వీటిని సక్రమంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడి రైతులను ఈ షెల్టర్ల నిర్వహణలో భాగస్వాములు చేయాలని చెప్పారు. పాడి రైతులందరినీ ఒక బృందంగా ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను ఆ బృందానికి అప్పగించాలన్నారు. వీటిని పశు వసతి కేంద్రం (కాటిల్ హాస్టల్)గా అభివృద్ధి చేసి వసతి తో పాటు పశువులకు అవసరమైన మేత, దాణా కూడా సమకూర్చాలని చెప్పారు. వ్యవసాయంతో పాటు పాడి కూడా ఉండాలని, అప్పుడే రైతు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఆ ఉద్దేశంతోనే సామాజిక పశువుల చావిడి లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని అన్నారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ.... గండ్రాయిలో సామాజిక పశువుల చావిడి (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. డొంక రోడ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... డొంక



రోడ్లను వేయిస్తామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ చెప్పారు. సుబ్బాయి గూడెంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. దీనిని సక్రమంగా నిర్వహించాలని, సామాజిక పశువుల చావిడి నుంచి వచ్చే పశువ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డ్వామా పీడీ రాము, జగ్గయ్యపేట ఎంపీడీవో జి. నితిన్, పెనుగంచిప్రోలు ఎంపీడీవో శ్రీను, ఏపీడి లక్ష్మీ కుమారి, పశువర్ధక శాఖ డిడి, ఏడీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. .

# నేటి దినపత్రిక సూర్య కధనంపై స్పందించిన నైనవరం పంచాయితీ అధికారులు

**అధ్వాన్న రోడ్ల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

**పంచాయితీ కార్యదర్శి అజేంద్ర**

**హుటాహుటిన కాల్వల్లో పూడిక తీతతో పాటు రోడ్లపై ఫోకస్**



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలంలోని పి.నైనవరం లో అధ్వాన్న రోడ్లపై నేటి దినపత్రిక సూర్య కధనానికి పంచాయితీ కార్యదర్శి అజేంద్ర స్పందించారు. హుటాహుటిన శాటినేషన్ సిబ్బందితో కాల్వల్లో పూడికతీ తీసి వర్షపు నీటిని కాల్వలకు మళ్ళించడంతో పాటు రోడ్ల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు వివరణ ఇచ్చారు. ప్రధానంగా రోడ్లపై వర్షపు నిలిచిపోవడం ఇప్పటికే రోడ్లన్నీ గుంతలుగా మారడంతో అటు స్థానికులు ఇటు వాహనదారులు తీవ్ర ఆందోళణ చెందుతున్నారు. దీంతో అటు పంచాయితీ కార్యదర్శి అజేంద్ర, సర్పంచ్ బట్టా చిన్నబ్బాయి స్పందిస్తూ.... రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని కాల్వలకు మళ్ళించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అదేవిధంగా రోడ్ల పరిస్థితిని పంచాయితీ తీర్మానం చేసేసి ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని అక్కడ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా నైనవరం పంచాయితీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పంచాయితీ పరిధిలోని ప్రజలు ఏ చిన్న సమస్య తలెత్తినా నేరుగా పంచాయితీ కార్యాలయం వద్ద కు వచ్చి తమ సమస్యను తెలియచేస్తే సమస్య పరిష్కారంకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# రిటైర్డ్ ప్రొఫెసర్ యార్లగడ్డ వీరభద్రరావు మరణం బాధాకరం

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** కొన్ని వేల మంది భావి భారత పౌరులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో రిటైర్డ్ ప్రొఫెసర్ యార్లగడ్డ వీరభద్ర రావు కృషి మరువలేనిదని, ఆయన మరణం బాధాకరమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. విజయవాడ లయోలా కళాశాల రిటైర్డ్ గణిత ప్రొఫెసర్ డాక్టర్ యార్లగడ్డ వీరభద్రరావు(92) వృద్ధాప్యం తో శుక్రవారం ఉదయం మృతి చెందారు. తనకు పెదనాన్న వరుసైన వీరభద్రరావు మరణ వార్తను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకట్రావు కుటుంబంతో సహ బెంజ్ సర్కిల్ సమీపంలోని వీరభద్రరావు నివాసానికి వెళ్లి మాస్టారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరభద్రరావుతో తనకు గల అనుబంధాన్ని ఎమ్మెల్యే వెంకట్రావ్ గుర్తు చేసుకున్నారు. గణితాన్ని ఎంతో నేర్పుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆయన బోధన సాగేదన్నారు. ఆయన వద్ద చదువుకున్న ఎందరో విద్యార్థులు నేడు, దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వీరభద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరభద్రరావు చివరికోరిక మేరకు ఆయన భౌతికయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం పిన్నమనేని వైద్య కళాశాలకు అందజేశారు. ఇది ఇలా ఉండగా వీరభద్ర సోదరుడు రాజగోపాల్ రావు 1985లో టిడిపి అభ్యర్థిగా వంగవీటి రంగా పై పోటీ చేసి రెండు వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. రాజగోపాల్ రావు సతీమణి డాక్టర్ సీతారత్నం విజయవాడలో ప్రముఖ గైనకాలజిస్ట్ గా పేరొందారు. పమిడిముక్కల మండలం, పెనుమత్సలో జన్మించిన వీరభద్రరావు, ఆయన సోదరుడు ఇద్దరూ బెనారస్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి లైయోలా కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి విద్యార్థులకు తమ సేవలను అందించారు.



### పాఠశాలల్లో చేపడుతున్న ఆధార్ క్యాంపులను
## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** చిన్నారులు, విద్యార్థుల ఆధార్ కార్డులు అప్డేట్ చేసుకోవడానికి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల ఎంపిడివో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలోని శ్రీనివాస స్కూల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపు ను ఎంపిడివో సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఏళ్లు నిండిన పిల్లలు, 15 ఏళ్లు దాటిన వారు తమ ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వివిఎస్ నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులతో చర్చ గోష్టి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం స్థానిక ఘంటసాల మండలంలోని శ్రీ బాల పార్వతీ సమేత జలదీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అకాల వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై రైతులతో చర్చ గోష్టి కార్యక్రమాన్ని వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థినులతో కలిసి నిర్వహించారు. ప్రస్తుత కాలంలో వరి పంట ఈనిక దశ నుండి గింజ పాలు పోసుకునే దశ వరకు ఉందని, ఈ అకాల అధిక వర్షాలకు పంట దెబ్బతిని తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సమన్వయ కర్త డా డి సుధా రాణి రైతులకు వివరించారు. ఈ వర్షాలకు మాని పండు తెగులు ఆశించే ఆస్కారం ఉంటుందని, వ్యాప్తి నివారణకు వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రొపికోనజోల్ 200 మి లీ ఎకరానికి చెప్పిన పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు డా. రేవతి, డా. వెంకటలక్ష్మి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

## రైతన్నలకు విధేయురాలై ఉంటా..
### నూతన చైర్మన్ అనంతలక్ష్మి



**పెడన మేజర్ న్యూస్:** దేశానికి రైతులే వెన్నెముక లాంటి వారిని అటువంటి రైతన్నలకు అన్నదాతలకు అండగా ఉంటానని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన చైర్పర్సన్ భీముని అనంతలక్ష్మి అన్నారు ఈ మేరకు మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ డైరెక్టర్లు, చైర్పర్సన్ చే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ తాను రైతు పక్షపాతిగా ఉంటానని చెబుతూ, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఇంత బరువు బాధ్యతలు అప్పగించినందుకు స్థానిక శాసనసభ్యులకు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి ప్రభుత్వ నాయకులు, తదితరులు ఉన్నారు.

## సంస్థ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
### ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ 184 వ బోర్డు సమావేశం గురువారం సాయంత్రం నగరంలోని గాంధీ నగర్ ఏపిహెచ్ డిసి లేపాక్షి కార్యాలయంలో సంస్థ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ అధ్యక్షతన, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. విశ్వ సమక్షంలో నిర్వహించినట్లు శుక్రవారం తెలిపారు. సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి, ప్రోత్సాహం, కళాకారుల సంక్షేమానికి తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ప్రధాన అంశాలపై చర్చించారు. అదేవిధంగా మార్కెటింగ్ అభివృద్ధి, కళాకారుల ప్రోత్సాహం, సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వ్యూహాలను కూడా వారు సమీక్షించారు. అనంతరం నూతనంగా నియమితులైన డైరెక్టర్లు ఆర్. డివిఎస్. ప్రసాద్, గంగల్ల జీవిత, పొగాకుల సోమశేఖర్, పుట్టం శ్రీనివాసుల రెడ్డి లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు, సమావేశంలో బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.



## ఫిలిప్ మోరిస్ ఐపిఎం ఇండియా
## గ్రో టాలెంట్ గ్రో బిజినెస్ విస్తరణ

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఇంక్. ఇండియా అనుబంధ సంస్థ అయిన ఐపిఎం ఇండియా, దాని ప్రధాన చొరవ గ్రో టాలెంట్ గ్రో బిజినెస్ విస్తరణతో ప్రతిభ అభివృద్ధికి దాని నిబద్ధతను మరింత వేగవంతం చేస్తోంది. రెండు శక్తివంతమైన ఎనేబుల్‌లపై నిర్మించబడింది. కెరీర్ యాజమాన్యం వృద్ధి నమూనా, స్వీయ ఆధారిత కెరీర్ ప్రణాళికను ప్రారంభించే ప్రతిబింబించే ఫ్రేమ్‌వర్క్, వ్యక్తిగతీకరించిన అభివృద్ధి మద్దతు అందుబాటును ప్రజాస్వామ్యం చేసే డిజిటల్ కోచింగ్ ప్లాట్‌ఫామ్ ఉయ్ ఏస్. ఈ కార్యక్రమం ఉద్యోగులు తమ కెరీర్‌లను బాధ్యత వహించడానికి సాధికారత ఇస్తూనే, అదే సమయంలో వ్యాపార ప్రాధాన్యతలతో వ్యక్తిగత వృద్ధిని సమలేఖనం చేస్తుందని ఐపిఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవనీల్ కర్ పేర్కొన్నారు.

## మద్యం దుకాణాలపై ఎమ్మెల్యే కాగిత తనిఖీలు



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** మండలం లోని అర్తమూరు గ్రా మంలో శుక్రవారం మద్యం దుకాణాలపై స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నకిలీవో, నిజమైనదో అనే విషయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వయంగా పరిశీలించారు. ఈ మేరకు ఆయన మద్యం దుకాణంలో సీసాలను వాటిపై ఉన్న లేబుల్స్, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మద్యం విక్రయాల్లో నకిలీ బా టిల్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సురక్ష యాప్ ద్వారా ప్రతి వినియోగదారుడు కూడా బాటిల్పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ మద్యం నిజమైనదో కాదో సులభంగా తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే మద్యం దుకాణ యజమానులు ప్రభుత్వ నిబం ధనలను కచ్చితంగా పాటించాలని, నకిలీ మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాటు బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ కూటమి నాయకులు కార్యకర్తలు, వినియోగదారులు పాల్గొన్నారు.

## మృతురాలు జహరాబి కుటుంబానికి సర్పంచ్
## రూ.10వేల ఆర్థిక సహాయం



**ఏ.కొండూరు మేజర్ న్యూస్ :** ఏ.కొండూరు మండలం కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ జానీ సతీమణి షేక్ జహరాబి (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పర్వతనేని చంద్రమోహన్, సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతురాలి మట్టి ఖర్చులు నిమిత్తం సర్పంచ్ నాగమల్లేశ్వరి చంద్రమోహన్ రూ10వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

### పాస్‌పోర్టుపోయినది

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఉపద్రష్ట లక్ష్మణ సూరి s/o యు.వెంకట కృష్ణయ్య (లేటు), వయస్సు 56, కులం : బ్రాహ్మణ, డోర్.నెం. 20-1-7(4212) 4వ బ్లాక్ ఇందిరా ఎన్ క్లేవ్, రాఘవేంద్ర థియేటర్ బ్యాక్ సైడ్, అయోధ్య నగర్ విజయవాడ వారి యొక్క పాస్‌పోర్ట్ నెంబర్. V428857 ఇష్యూ డేట్ 28/11/1995 – ది.10/9/2025వ తేదీన విజయవాడ ఆర్టీసీ బస్టాండు నందు మిస్ అయినాయి. నా యొక్క పాస్‌పోర్ట్ ఆచూకీ తెలిసిన యెడల పై అడ్రస్‌కు తెలియపరచవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు **ఉపద్రష్ట లక్ష్మణ సూరి,**

సెల్ నెం. **9490336958,** అయోధ్య నగర్, విజయవాడ

### మేమున్నాం సేవా సంస్థ ద్వారా
## చేనేత కార్మికురాలికి ఆర్థిక సాయం



**పెడన, మేజర్ న్యూస్ :** పట్టణం 17వ వార్డులో గల కొసనం వారి వీధి నివసితురాలు చేనేత కార్మికురాలు మెట్ల పార్వతి 70 సం. “ భర్త ఇటీవల మృతి చెందగా, కొడుకు అనారోగ్య రీత్యా మంచానికే పరిమితం కాగా,ప్రస్తుతం గత వారం రోజులుగా అకాల వర్షం రోజు గడవని పరిస్థితుల్లో ఉందని తెలుసుకుని ఏమున్నాం సేవా సంస్థ ద్వారా ఆమెకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించామని ఆ సంస్థ చైర్మన్ వీనం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆమె నివాసం వద్దకు వెళ్లి నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దినస్థితిలో ఉన్న చేనేత కార్మికురాలికి వెయ్యి రూపాయల నగదును 20 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు ఆమెకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సింగరాజు ప్రకాష్, 17 వ వార్డు టీడీపీ ఇన్చార్జి కలీల్ భాషా,పట్టిసపు పవన్ కళ్యాణ్,నల్ల సాయిబాబు, బందారులంక అయ్యప్ప,వెంకన్న తదితరులు ఉన్నారు.

## ఈనెల 29న కురుమద్దాలిలో జాబ్ మేళా




**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని కురుమద్దాలిలో ఈనెల 29వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా తెలిపారు. కురుమద్దాలిలోని కొసరాజు వెంకట పూర్ణచంద్రరావు సామాజిక భవనంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ కేంద్రంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని దాదాపు 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనిలో భాగంగానే ముందుగా నిరుద్యోగులకు శిక్షణ అందించి అనంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత ముందుగా తమ పేర్లను ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వెబ్ సైట్లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత పూర్తి వివరాలకు 8074370846 ఫోన్ నెంబర్ ను సంప్రదించవలసిందిగా ఎమ్మెల్యే కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## డెమొక్రటిక్ పిఆర్టియు వారిచే
## నూతన ఉపాధ్యాయులకు సత్కారం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** 2025 మెగా డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకు జి కొండూరు మండలంలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు డెమొక్రటిక్ పి ఆర్ టి యు వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డా.డి శ్రీను మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయులకు సేవలందించటమే డెమొక్రటిక్ పిఆర్టియు లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు ప్రభుత్వం మొదటి సంతకం తోనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులను నియమించిందని అన్నారు జాతీయ సేవాదల్ పేరుతో ఉపాధ్యాయులకు సమాజానికి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు జిల్లా అధ్యక్షులు డా. పి నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కరించడానికి ఎల్లవేళలా పనిచేస్తామని తెలియజేశారు అనంతరం నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులకు పిఆర్టియు నాయకులు, విశిష్ట అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి పీవీ నరసింహారావు సర్వీసు రిజిస్టర్ ప్రోత్సాహక సర్టిఫికెట్, శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు ఆర్ దేవిప్రాజు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ శ్రీనివాస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అక్బర్ పాషా జిల్లా నాయకులు ప్రసాద్ వాసు రేఖ నరసింహారావు రామారావు పూర్ణ నాగరాజు కిరణ్ విజయ్ వెంకటరావులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





### ప్రజలకు ఏ సమస్య ఉన్న మున్సిపల్ సిబ్బంది వెంటనే పరిష్కరించాలి
### మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో డ్రైనేజీల వ్యవస్థని మెరుగుపరుస్తాం
### మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ జిల్లా కోర్టు సాయి బాబా గుడి వద్ద వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో 45 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్తో కలసి మచిలీపట్నం నగర కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్, సిహెచ్.వి.వి.ఎస్ బాపిరాజు శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చి త్వరగా నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించి మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు కాచి చల్లార్చిన మంచినీటిని తాగాలని సూచించారు. మచిలీపట్నం నగరంలో శానిటేషన్ సరిగా లేదని తెలిస్తే సహించేది లేదని శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. ప్రజల నుండి ఏదైనా సమస్య శానిటేషన్ సిబ్బందికి వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.

జిల్లా కోర్టు సెంటర్లో సాయిబాబా గుడి వద్దమంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో రెండు కల్వర్టర్లు వేయడం జరుగు తోందని, ఆ కల్వర్టర్ల పనులు వెంటనే మొదలు పెడతామనితెలిపారు. కల్వర్టర్లు పూర్తయితే జిల్లా కోర్టు సెంటర్లో నీరు నిల్వ ఉండదని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర సూచనలతో డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుప రుస్తాం అని తెలిపారు. ప్రజలు కూడా సహకరించాలని డ్రైనేజీలలో ప్లాస్టిక్, ఇతర పదార్థాలను వెయ్యకుండా, శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు ఆ చెత్తను అందించి సహకరించాలని ప్రజలను కమిషనర్ బాపిరాజుకోరారు.డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, పి. వి. ఫణి కుమార్ డివిజన్లో గల పలు సమస్యలను మున్సిపల్ కమిషనర్ బాపిరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఆ సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులకు కమిషనర్ బాపిరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్,పి. వి. ఫణి కుమార్ తో పాటుగా 45వ డివిజన్ సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎ.కొండూరు వైసీపీ నూతన అధ్యక్షునిగా గనియా



**ఏ కొండూరు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** ఎ.కొండూరు మండల వైసిపి నూతన అధ్యక్షునిగా రెండవసారి భూక్యా గనియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో చీమలపాడు సర్పంచ్ గా 10 సంవత్సరాలు పనిచేశారు. 5 సంవత్సరాలు ఎంపీపీగాను, రెండు సార్లు జడ్పిటిసిగా పనిచేశారు. ప్రస్తుతం జడ్పిటిసిగా కొనసాగుతున్నారు. గతంలో ఆరు సంవత్సరాలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ను, 2014 నుండి 2025 వరకు మండల వైసీపీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.తన పదవికి కృషిచేసిన తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాసుకు, ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్ కు, తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు మోదుగు వేణుగోపాల్ రెడ్డికి, రాజ్యసభ సభ్యులు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు వై వి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గనియా మాట్లాడుతూ ఎ. కొండూరు మండలంలో వైయస్సార్సీపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి పార్టీ విజయానికి శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్య వైఖరి... కేజీవై రోడ్కి అధ్వాన పరిస్థితి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి. కొండూరు మండలం గడ్డమణగు గ్రామం నుండి చెరువు మాధవరం వరకు. కేజీ వై రోడ్డు అధ్వాన పరిస్థితిగా నెలకొన్నది. జి కొండూరు నుండి దుగ్గిరాలపాడు వరకు రోడ్డు వైండింగ్ లో భాగంగా ఈ రోడ్డు అధ్వానంగా తయారయిందని ప్రజలు వాపోతున్నారు ఆర్ అండ్ బి ఆర్ధబ్ల్యుసి. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణం. కేజీ వై రోడ్లో ప్రయాణం చేయాలంటే. పాదచారులు ద్విచక్ర వాహనదారులు ప్యాసింజర్ ఆటోలు స్కూల్ బస్సులు. తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డు రైతుల వ్యవసాయ ఉత్పత్తిలో రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ గుంతల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు స్థానిక రైతులు వాపోతున్నారు ఎప్పుడు ఏం జరుగుద్దో తెలియని పరిస్థితి. అనేకమంది ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురి అయ్యి ఆసుపత్రి పాలో అవుతున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. అధికారులు కళ్ళులేని వారిగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కనీసం గుంతలైన పోడ్చాలని ప్రజలు కోరుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీ వై రోడ్డున నిర్మాణం చేయాలని కోరుకుంటున్నారు.

# మురుగు నీటి ప్రవాహ కాల్వ పై ఉన్న అడ్డంకుల తొలగింపు




**నాగాయలంక అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీర ప్రాంత రైతులు పొలాలలోని మురుగునీరు బయటకు పోక నానా రకాలుగా ఇబ్బందులుపడుతున్నారు. రైతులు తమయొక్క ఇబ్బందులపైన సమస్యను డిసి చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున రావు( చిన్న బాబు) దృష్టికి తీసుకుని వెళ్ళగా వారు సకాలంలో స్పందించి తెలుగుదేశం పార్టీమండల,నాయకుడు మెండు. లక్ష్మణరావుతో కలిసి వెళ్లి తలగడదీవి చోడవరం మధ్యన ఉన్న ఉప్పు కాలువ వద్ద గల మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉన్నసమస్యను జెసిబి సహాయముతో డ్రైనేజీలోన గల ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్ళ చెట్లను వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తొలగించి తీరప్రాంత రైతులకు మురుగుపోయే విధముగా ప్రొక్లైన్ ద్వారా పూడిక తీయించి రైతులకు పొలాలలోని మురుగు నీరు బయటకు పోవుటకు తన వంతుగా సకాలంలోస్పందించి నారు. రైతు సోదరులు సనకా శేషు కుమార్ మద్ది వెంకటేశ్వరరావు పెనుమాల రాజేష్ బండ్రెడ్డి పెరుమళ్ళు, సమీప ప్రాంత రైతులు ధన్యవాదాలు తెలిపినారు ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి శాశ్వత పరిష్కారం చేయవలసిందిగా కోరుతున్నారు.

# జలమయమైన అవనిగడ్డ రహదారులు





**వర్షపు నీటిలో నానుతున్న లోతట్టు ప్రాంతాలు**

**పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దివిసీమ తడిసి ముద్దయింది వరుసగా బంగాళాఖాతం లో అల్పపీడన ద్రోణి, వాయుగుండాలు పడుతూ ఉండడంతో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలాకుతలం అయింది. అవనిగడ్డ- నాగాయలంక ప్రధాన రహదారి కాలువను తలపించేలా వర్షపు నీరు ప్రవహిస్తోంది. ప్రభుత్వ హైస్కూల్ జూనియర్ కాలేజ్ డిగ్రీ కళాశాలల క్రీడా మైదానం నీటితో నిండి చెరువులా మారింది. లంకమ్మ మన్యం, రాజశేఖర్ పురం, మండలి పురం, సింహాద్రి కాలనీ, బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, 8 9 వార్డులలో రహదారులన్నీ జలమయం కాగా కొన్ని ప్రాంతాలలో గృహాలలోకి వర్షపు నీరు చేరగా ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీనితో ప్రభుత్వ కార్యాలయాలకు పలు పనులపై వచ్చే ప్రజలు అసహనానికి గురి అయ్యారు గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించి పోగా వ్యాపారాలు లేక షాపు లు వెలవల పోతున్నాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఎక్కడికి ఎక్కడ మీరు నిలువ ఉండిపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పంచాయతీలు బీజింగ్ సున్నం చల్లటానికి కూడా వీలు లేకుండా వర్షాలు పడుతూనే ఉన్నాయి. విద్యుత్ అధికారులు విద్యుత్ పై జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు మొత్తం మీద దివిసీమ నాలుగు రోజుల నుండి కురిసిన వర్షాలకు తడిసి ముద్దయింది.

# వర్షాల నేపధ్యంలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపధ్యంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి కె. మురళీకృష్ణ తెలిపారు. చల్లపల్లి మండలం మేకావారిపాలెం గ్రామంలో వరిపొలాలను ఏవో పరిశీలించి రైతులతో మాట్లాడారు. సస్యరక్షణ చర్యలపై వారికి సూచనలు అందించారు. మూడు రోజుల్లో 150 మి. మీటర్ల వర్షపాతం నమోదు కావటంతో పంటపొలాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉందన్నారు. పాలుపోసుకునే దశలో పంట ఉం దనీ, చీడపీడల ఉధృతి పెరగకుండా రైతులు పొలం నుంచీ నీటికి బయటకు మళ్లించాలన్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా 15 కిలోల పొటాష్ చొప్పున పైపాటుగా వేసుకోవాలని, పొడ తెగులు ఉధృతి గమనించిన ఎడల హెక్సాకొనజోల్ రెండు ఎంఎల్, లేదా ప్రొపికోనజోల్ ఒక ఎంఎల్, అగ్గితెలుగు లక్షణాలు గమనించిన వెంటనే ట్రైసైక్లజోల్ 0.6గ్రాము, సుడిదోమ ఉధృతి గమనిస్తే డినోటాఫ్యూరాన్ 0.4 గ్రా లేదా పైమెట్రోజిన్ 0.6 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి మొక్క పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని వివరించారు. మరింత సమాచారం కోసం రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

# టౌన్ వెండింగ్ కమిటీ సమీక్ష సమావేశం




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** గౌరవ మునిసిపల్ కమీషనర్, టౌన్ వెండింగ్ కమిటీ చైర్మెన్ ఛాంబర్లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పట్టణ వీధివిక్రయదారుల కమిటీ సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు వీధివిక్రయదారులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించి తీర్మానములు చేయుట జరిగినది. వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం విజయవాడ పట్టణం లో వివిధ రకముల వీధి వ్యాపారములు చేయుచున్న వీధి విక్రయదారులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ లను పొందవలసియున్నది. అందుకు గాను విజయవాడ పట్టణంలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్ ద్వారా సర్వే చేయడం జరుగుచున్నది. ఈ సర్వే లో నమోదు కాబడిన వీధి విక్రయదారులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ పొందుటకు రుసుము రూ.200/- లు చెల్లించవలసియున్నది. అదేవిధంగా పట్టణం మొత్తము గ్రీన్, అంబర్, రెడ్ జోన్ లు గా మార్కింగ్ చేసిన జోన్ లను జోనల్ కమీషనర్ ల యొక్క సమక్షము లో వివిధ స్టేక్ హోల్డర్ లతో సమావేశము నిర్వహించి జోన్ ల యొక్క తుది జాబితా తయారుచేయవలేనని తీర్మానం చేయడమైనది. అలాగే పిఎం స్వానిధి 2.0 కార్యక్రమం క్రింద ప్రతి నెల లోక కళ్యాణ మేళ నిర్వహించి వీధి విక్రయ దారులందరికి కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన కల్పించాలని, అర్హులైన వీధి విక్రయదారులందరికి బ్యాంకు ఋణాలు మొదటి సారిగా రూ.15,000లు, రెండవసారి రూ.25,000లు మూడవసారి రూ.50,000 లు త్వరితగతిన మంజూరు చేయించాలని తీర్మానము చేయుట జరిగినది. ఈ సమావేశంలో కార్పొరేటర్ వల్లూరి ఎన్ డిఎస్ మూర్తి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, టౌన్ వెండింగ్ కమిటీ కన్వీనర్, ప్రాజెక్టు ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ,లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కే. ప్రియాంక, బ్రాంచ్ మేనేజర్ ఎం.సుధాకర్, కమిటి సభ్యులైన వీధి వ్యాపారస్తులు ఎల్.వి. ముర్తిరావు చిప్పడ, వడ్లముడి శ్రీనివాస్, నాగ వెంకట బాలకృష్ణ, షేక్ సబీర్, బొమ్మిసేట్టి జగన్మోహన్ రావు, కంకిపాటి రత్నకుమారి, పిల్లి నాగమల్లేశ్వరి,కద్గరాజు మీనషి, తదితర్లు, పాల్గొన్నారు.



## శ్రీకొండలమ్మ ఆలయ హుండీ ఆదాయం 18లక్షల 66వేల 590 రూపాయలు



**గుడ్లవల్లేరు అక్టోబరు 24 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను ఈ రోజు అనగా 24.10.2025 శుక్రవారం ఉదయం 9.00 గం లకు అరుణ, కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-1, భోగిరెడ్డిపల్లి గ్రూప్, మచిలీపట్నం వారి పరివేక్షణలో శ్రీ అమ్మ వారి దేవస్థాన చైర్మన్ ఈడే మోహన్,, ధర్మకర్తల మండలి తూము రాజ్యలక్ష్మీ, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, మన్నెం వీర నాగేంద్రం, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షమున తెరిచి లెక్కించగా మొత్తం 39 రోజులకు గాను నోట్లు ద్వారా రూ.16,81,420లు, చిల్లర ద్వారా రూ.1,85,170లు వెరసి మొత్తము రూ.18,66,590లు వచ్చియున్నది. సదరు హుండీ లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది, మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్, రేపల్లి, వుయ్యూరు సేవా సమితి, వేమవరం గ్రామస్తులు, భక్తులు తదితరలు పాల్గొన్నారని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.

## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వివిఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా ఆంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.





## ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారిని ఏకం చేసిన మహనీయుడు స్వర్గీయ మండలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారినందరినీ ఏకం చేసిన మహనీయుడు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు అని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు జోరు వర్షంలో కూడా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక వంతెన సెంటరులో ఎంవీ కృష్ణారావు విగ్రహానికి చిట్టిబాబు ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రం రోడ్డు, రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులు మహమ్మద్ వాహేదుల్లా, అబ్దుల్ సాధిక్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీసీ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), యర్రంశెట్టి సుబ్బారావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ లుక్కా వెంకట పిచ్చియ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, కూటమి నాయకులు బండే రాఘవ, అన్నపరెడ్డి వెంకటస్వామి, ఆకుల సీతా మహాలక్ష్మి, గుగ్గిలం శ్యాం కుమార్, డేగల రాఘవ, బాలు శ్రీనివాస్, బచ్చు ఆదినారాయణ, దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర చైర్పర్సన్ మంజుల దేవికీ ఈతల పోటీలో ఆరు పథకాలు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నర్సుసుల విభాగం రాష్ట్ర చైర్పర్సన్ మంజుల దేవికీ రాష్ట్రస్థాయి ఈతల పోటీలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు పథకాలు సాధించిన గవర్నమెంట్ నర్సులలో ప్రథమ మహిళ గా గుర్తించి సన్మానించిన రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ కేఆర్ సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ కె రమేష్ బాబు, ఆర్ టి సి విభాగం నుండి కేదార్ రావు, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ చైర్ పర్సన్ గా మంజుల దేవి, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గవర్నమెంట్ నర్సస్ కి సంబంధించి కొన్ని వినతులు తో కూడిన పత్రాన్ని మంత్రికి చైర్పర్సన్ మంజులాదేవి అందజేశారు. వినతులలో ముఖ్యంగా స్టాఫ్ నర్స్ నుండి నర్సింగ్ ఆఫీసర్గా మార్పు చేయుటకు వినతి, హెల్త్ సెంటర్లో 4 నాలుగువ స్టాఫ్ నర్సని నియమించాలని , మారుమూల ప్రాంతాల్లోని ప్రైమరీ హెల్త్ సెంటర్స్ లో నైట్ టైం డ్యూటీ చేసే స్టాఫ్ నర్స్ కి సపోర్టింగ్ ఎఫ్ ఎన్ ఓ పోస్ట్ అదనంగా నియమించాలని తదితర వినతులతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు మంత్రి సత్య కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. వీటిపై తగిన నిర్ణయం తీసుకుని ఈ యొక్క సమస్యలను పరిష్కారం చేస్తానని మాట ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుండి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వసతి గృహాలలో మెరుగైన సౌకర్యాలు సమకూర్చండి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు సమకూర్చి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ బీసీ సంక్షేమ వసతి గృహ అధికారుల సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరు మండలాల్లోని బీసీ వసతి గృహాల్లో మౌళిక సౌకర్యాలు, పరిస్థితులపై సమీక్షించారు. వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జరుగుతున్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డార్మెటరీలు, వంట గదుల్లో టైల్స్ వేసే పనులు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వసతి గృహాల్లోకి నీరు చేరకుండా డ్రైనేజీలు పూడిక తీయించాలని ఎంపీడీఓలకు సూచించారు. వసతి గృహాల్లో పిల్లలను అధికారులు తమ స్వంత బిడ్డల్లా చూసుకోవాలని, వారి వ్యక్తిగత భద్రత, ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీఓలు మరియాదేవి, సుధాప్రవీణ్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో 22 సూచికల్లో శత శాతం ప్రగతి







**ఎన్టీఆర్ జిల్లా/ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అత్యంత పారదర్శకంగా, జవాబు దారీతనంతో అమలుచేస్తూ సమష్టి కృషితో ఆకాంక్షిత బ్లాకుల్లో సమగ్రాభివృద్ధికి కృషిచేయడం జరుగుతోందని.. ఆకాంక్షిత బ్లాకు అయిన ఇబ్రహీంపట్నం బ్లాకులో మొత్తం 40 సూచికలకుగాను 22 సూచికల్లో 100 శాతం లక్ష్యాలను చేరుకున్నట్లు కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. నేషనల్ వాటర్ మిషన్ (ఎన్ డబ్ల్యూఎం) డైరెక్టర్, కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్లఅశోక్‌బాబు ఆకాంక్షిత మండలమైన పెనుగంచిప్రోలులో గురువారం పర్యటించగా శుక్రవారం మరో ఆకాంక్షిత మండలమైన ఇబ్రహీంపట్నంలో పర్యటించారు. తొలుత కాచవరం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఈ కేంద్రం ద్వారా అందించే నాణ్యమైన వైద్య సేవలపై అభిప్రాయాలు తీసుకున్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, మునగ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లాలో హరిత విస్తీర్ణాన్ని 33 శాతానికి చేర్చేందుకు గ్రామాలవారీగా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. అనంతరం కేతనకొండలో సాక్షం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రం పరిధిలో 425 కుటుంబాలు ఉండగా, కేంద్రంలోని 15 మంది చిన్నారులకు అందుతున్న పూర్వ ప్రాథమిక విద్యా ప్రణాళికను పరిశీలించారు. చిన్నారుల గ్రోత్ పెరామీటర్స్ రికార్డులను పరిశీలించారు. వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారో లేదో స్వయంగా పరిశీలించారు. గర్భిణీతో మాట్లాడి అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పోషకాహారం, కౌన్సెలింగ్, ఇతర మద్దతుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాంగణంలోని పోషణ వాటికను పరిశీలించి.. అందులో సాగుచేస్తున్న ఆకుకూరలను పరిశీలించారు.

**లక్ష్యాలకు అనుగుణంగా మార్గనిర్దేశనం చేయండి:**

ప్రభారీ అధికారి అశోక్‌బాబు.. మూలపాడు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి కెరీర్ పరంగా వారి ఆకాంక్షలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గత పదోతరగతి పరీక్షల్లో 87 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఉపాధ్యాయులు వివరించగా ఇకపై 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని అశోక్‌బాబు సూచించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడుతున్నారో గుర్తించి.. ఆయా సబ్జెక్టుల్లో ప్రగతి సాధించేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్నారుల ఆకాంక్షలకు అనుగుణంగా కెరీర్ ఆప్షన్లపై మార్గనిర్దేశనం చేయాలని.. ఇందుకు ఆధునిక సాంకేతికతను కూడా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థుల్లో సబ్జెక్టు నైపుణ్యాలతో పాటు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనశాలను పరిశీలించారు. అనంతరం కొండపల్లి బొమ్మల కళాకారులతో మాట్లాడారు. బొమ్మల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఒక జిల్లా బి ఒక ఉత్పత్తి కార్యక్రమం ద్వారా హస్తకళాకారులకు మేలు జరుగుతోందన్నారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం అశోక్‌బాబు ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 2023 నుంచి ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) అమలవుతోందని.. ఇందుకు దేశ వ్యాప్తంగా 500 బ్లాక్‌లను కేంద్రం ప్రకటించగా.. ఇందులో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాక్‌లు/మండలాలు ఉన్నాయన్నారు. ఈ మండలాల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అఖిల భారత సర్వీసుల సీనియర్ అధికారులకు ప్రభారీ అధికారులుగా బాధ్యతలు అప్పగించడం జరిగిందని.. జిల్లాలోని రెండు బ్లాకులను పరిశీలించేందుకు తాను ఇప్పుడు జిల్లాలో పర్యటిస్తున్నట్లు వివరించారు. వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయ–వ్యవసాయ అనుబంధ సేవలు, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి ఇలా అయిదు ఇతివృత్తాలకు సంబంధించి మొత్తం 40 సూచికలు ఉన్నాయని.. ఈ సూచికల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు మదిస్తూ.. మెరుగైన ప్రణాళికలను అమలుచేస్తూ ముందుకెళ్లడం జరుగుతోందన్నారు. మొదటి దశ సంపూర్ణతా అభియాన్‌ను విజయవంతంగా ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలులో అమలుచేయడం జరిగిందని.. ఇందులో ప్రగతికి ఫ్రంట్‌లైన్ సిబ్బందికి నీతి ఆయోగ్ బంగారు పతకాలు కూడా లభించాయన్నారు. త్వరలో సంపూర్ణతా అభియాన్ 2.0 కూడా ప్రారంభమవుతుందని బ్లాకు కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు, డీంఎహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, ఏబీపీ కోఆర్డినేటర్లు పి.శ్రీనివాస్, జి.మోహన్ సందీప్, ఎంపీడీవో డి.శకుంతల, తహశీల్దార్ వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా 'లింగమనేని' బాధ్యతల స్వీకరణ

**ఎమ్మెల్యే తో పాటు పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు**





**పామర్రు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ నూతన పాలకవర్గ కమిటీ శుక్రవారం విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ గా బత్తిన తాతయ్య బాబుతో పాటు పాలకవర్గ సభ్యులుగా పామర్రు నియోజకవర్గ పరిధిలోని మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, జనసేన పార్టీకి చెందిన దాసరి ప్రియా సౌజన్య లు బాధ్యతలు చేపట్టారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఈ కార్యక్రమంలో పాల్గొని రామలింగేశ్వరరావుకు శుభాకాంక్షలు అందజేశారు. గృహ నిర్మాణ సంస్థ పాలక మండలి సభ్యులుగా నలుగురు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా పామర్రు నియోజకవర్గానికి ఇందులో స్థానం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పామర్రు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రామలింగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, రాజులపాటి శ్రీనివాసరావు, వీరపనేని శివరామ ప్రసాద్, పార్టీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు సూరపనేని వెంకట సత్యనారాయణ, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు గొట్టిపాటి శ్రీధర్, లింగమనేని బాబురావు, మైనేని వెంకట నరేంద్ర, యార్లగడ్డ శ్రీనివాసరావు లతోపాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, కూనపరెడ్డి సుబ్బారావు, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని రామలింగేశ్వర రావుకు శుభాకాంక్షలు తెలిపారు. రామలింగేశ్వరరావు తో పాటు జనసేన పార్టీకి చెందిన ప్రియా సౌజన్యకు తాడిశెట్టి నరేష్ శుభాకాంక్షలు తెలిపి వీరిరువురిని ఘనంగా సత్కరించారు.

# ప్రకృతి వ్యవసాయ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన జిఐఎస్టి ప్రతినిధి బృందం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ క్షేత్రాలను శుక్రవారం జిఐఎస్టి ప్రతినిధి బృందం సందర్శించింది. ఎన్.టి.ఆర్ జిల్లా, జి. కొండూర్ మండలం లోని చెవుటూరు గ్రామంలో బృంద సభ్యులు పర్యటించారు. గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ సస్టైనబిలిటి (జిఐఎస్టి) చైర్పర్సన్ ఆంద్రే హోఫ్ మాన్, రొజాలీ హోఫ్ మాన్, సీఈఓ పవన్ సుఖ్వ్ తో పాటు గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య ఎస్. త్రిపాఠి లు బృందంలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ కోసం కృషి చేస్తున్న ఈ ఉన్నత స్థాయి బృందం, ఏపిసిఎన్ఎఫ్ అమలు విధానం, ఫలితాలు, గ్రామీణ జీవనోపాధులపై ప్రకృతి వ్యవసాయ ప్రభావాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ బృందాన్ని స్వాగతించి ప్రకృతి వ్యవసాయ తొమ్మిది సార్వత్రిక సూత్రాల"ను వివరించారు. అనంతరం ప్రతినిధులు గ్రామంలోని బయో రిసోర్స్ సెంటర్ను సందర్శించి, ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమైన జీవ ఉత్ప్రేరకాలు, ఇతర ఇన్పుట్ల తయారీ, సరఫరా విధానాలను తెలుసుకున్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్ నాయక్ జీవ ఉత్ప్రేరకాల తయారీ, విత్తన శుద్ధి, విత్తన గుళికల తయారీ వంటి పద్ధతులను వివరించారు. రైతులు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ ద్వారా మెరుగైన నేల ఆరోగ్యం, పంటల అభివృద్ధిపై తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ఎగ్జిబిషన్, ఫుడ్ బాస్కెట్ స్టాల్ ను కూడా బృంద సభ్యులు సందర్శించారు. 'హోమ్ న్యూట్రిగార్డెన్" రసాయనరహిత, పోషక వైవిధ్యంతో కూడిన ఆహారం కుటుంబ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో వివరించారు. వెంకట రమణమ్మ పెరటి తోటతో పాటు, పూర్ణచంద్రరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పత్తి పంటను సందర్శించారు. రైతు సాధికార సంస్థ థీమాటిక్ లీడ్ సుధాకర్ రసాయన వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో మధ్య తేడాలను తెలియజెప్పి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా పంట నాణ్యత, దిగుబడి, బ్రిక్స్ విలువలు మెరుగయ్యాయని వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించే విధానాలు, ఏడాది పొడవున పెరటి తోటల పెంపకం గురించి చర్చించారు. ఈ పర్యటనలో జే డి ఏ విజయ కుమారి, థీమాటిక్ లీడ్ చంద్ర శేఖర్, సీనియర్ కన్సల్టెంట్ విశ్వేశ్వర్ రావు., జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నందమూరి తారక రామారావు తనయుడు వరసగా మూడు సార్లు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టిన మానందమూరి బాలకృష్ణ గురించి పులివెందుల శాసనసభ్యుడు జగన్మోహనరెడ్డి తన తాడేపల్లి ప్యాలెస్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఇష్టానుసారంగా మాట్లాడుతూబాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడంటూ అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడి నీ సైకో బుద్ధి ప్రదర్శించావు జగన్ అంటూ అఖిల భారత ఎన్.టి.ఆర్. అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు వడ్డేల్లి సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్నె సోమేశ్వరరావులు తీవ్రంగా విమర్శించారు. అత్యున్నమైన శాసనసభ స్పీకర్ స్థానాన్ని సైతం విమర్శిస్తూ స్పీకర్‌కు అసలు బుద్ధి ఉందా అంటూ స్పీకర్ స్థానాన్ని అగౌరపరచిన నువ్వు శాసనసభ్యుడిగా ఉండేందుకు అనర్హుడువి జగన్.గత వై.సి.పీ. పాలనలో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో నీవు, నీ పార్టీ శాసనసభ్యులు ప్రతిపక్ష తెలుగుదేశం వారిని ఏవిధంగా బూతులు తిట్టేవారో ఒక్కసారి గుర్తుతెచ్చుకో సైకో జగన్. అంతేకాక శాసనసభలో సభ్యులు కానటువంటి తెలుగువారి అన్న ఎన్.టి. రామారావు కుమార్తె గురించి ఎటువంటి అసభ్య పదజాలంతో మీ వై.సీ.పి. సభ్యులు దూషించారో మర్చిపోయావా సైకో జగన్. కాగా ఇప్పుడు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ గురించి తప్పుడు ప్రేలాపనలు పేలుతున్నావు జగన్.మా బాలయ్య బాబు ఎంతటి గొప్ప దైవ భక్తుడో నీకు తెలుసా ? ప్రతిదినం తెల్లవారు ఝూమున నిద్ర లేచి, యోగాసనాలు చేసి,ఆ పిదప ఎంతో పవిత్రంగా పూజలు నిర్వహించి గాని బయట అడుగు పెట్టని వ్యక్తి.బాలకృష్ణ. అటువంటి వ్యక్తిని పట్టుకుని త్రాగి అసెంబ్లీకి వచ్చాడు అంటూ పిచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలడం మానుకో, లేనిచో ఇప్పుడు ఉన్న 11 సీట్లు కూడా మళ్ళీ గెలుచుకునే అవకాశం లేకుండా చేస్తారు ప్రజలు, గుర్తు పెట్టుకో జగన్మోహనరెడ్డి.గతంలో నీకు లండన్ మందులు కొంతమేరకు పనిచేసేవి,ఇప్పుడు అవికూడా పనిచేయటంలేదు అనుకుంటా! వెంటనే లండన్ మందులు మార్చుకో లేకపోతే ఆ కొద్దిపాటి బుద్ధి జ్ఞానం కూడా నీకు లేకుండా చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు జాగ్రత్త సుమా..నీవు ఇదేవిధంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికలలో నీవు, నీ పార్టీనామరూపాలు లేకుండా పోతారు.అని అఖిల భారత ఎన్.టి.ఆర్. అభిమాన సంఘం.జాతీయ ఉపాధ్యక్షుడు వడ్డేల్లి సాంబశివరావు.ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మన్నె సోమేశ్వరరావు అన్నారు.



## పతకాల వీరుడికి ఎమ్మెల్యే ఘనసన్మానం

**పెడన మేజర్ న్యూస్ :** విద్య,విజయం అనేవి వయసుతో సంబంధం లేకుండా వారి సత్తాపై ఆధారపడి ఉంటాయ ని అటువంటి వారిలో అరుదైన వ్యక్తి మన వరద భీమేశ్వరరావు అని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు టు మారో పార్టీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పసిడి,వెండి పతకా లను సాధించిన వ్యక్తి మన పట్టణ వాసి అవటం మనకు ఎంతో గర్వకా రణం అన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన కర్ణాటక పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలలో భీమేశ్వరావు మూడు గోల్డ్ మెడల్స్ ఒక సిల్వర్ మెడల్ గెలుచుకున్నార న్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి విచ్చేసిన భీమేశ్వరావు ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించామని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీ లలో 65 సంవత్సరాల వయస్సులో కూడా భీమేశ్వరావు గోల్డ్,వెండి పతకా లను సాధించడం రాష్ట్రానికి ముఖ్యంగా పెడన పట్టణానికి గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కమ్మగంటి వెంకటేశ్వరరావు, తమ్మా భీమయ్య, బట్ట శంకరరావు ఖలీల్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## యుఎన్‌సిసి సదస్సుకు వక్తగా విశ్రాంత ఐఏఎస్ అధికారి బి లక్ష్మీకాంతం



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** థాయిలాండ్‌లోని బ్యాంకాక్ నగరంలో నవంబర్ 3 తేదీన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ సెంటర్ యుఎన్సిసి ఆధ్వర్యంలో సస్టైనబుల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ 2025 సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా మాజీ కలెక్టర్, టిటిడి జేఈవోగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి బి లక్ష్మీకాంతం వక్తగా పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా నాయకులు విద్యావక్తలు పాల్గొని 2030 నాటికి ఆరోగ్య వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని విషయంపై పలు సూచనలు చేస్తారు. ఈ కార్యక్రమానికి హైదరాబాదు నుండి ప్రాతినిధ్యం వహించనున్న విశ్రాం త ఐఏఎస్ అధికారి బి లక్ష్మీకాంతంను అభినందిస్తూ, హైదరాబాదులోని సస్టైనబుల్ డెవలప్మెంట్ కార్యాలయ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరు ట్రావెల్స్ కు చెందిన ప్రైవేట్ బస్ కర్నూల్ జిల్లా చిన్నటేకూరు వద్ద బైక్ ను ఢీకొని మంటలు చెలరేగడంతో బస్ దగ్ధమై, ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటనలో ఇప్పటికే 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.


**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు: ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999